RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శుక్రవారం 14-8- 2026 సంపుటి : 6 సంచిక : 185 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00

ప్రభుత్వ నిర్లక్ష్యంతో

## ఆగిన కళ్యాణలక్ష్మి



పేదింటి పిల్లలకు శాపంగా మారిన కాంగ్రెస్ తీరు

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రాంతీయ విమాన కనెక్టివిటీ

## మరింత బలోపేతం



- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- విజయవాడ--వారణాసి విమాన సర్వీసులు ప్రారంభం

## పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్

# పాలనను బేరీజు వేయండి




మిగతా 2లో

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్

**హైదరాబాద్,అభ్యుదయం**

పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగు కోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా?

## పంద్రాగస్టు ఏర్పాట్లు

### పకడ్బందీగా ఉండాలి

- ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి విద్యుత్, త్రాగునీరు, ఇతర
- సదుపాయాలు సమకూర్చాలి అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి
- అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్



2లో

హైదరాబాద్,ఆగస్టు13 : రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో

## మైనార్టీ రిజర్వేషన్లు

### కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు

ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి

మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్, అభ్యుదయం**

ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు.

## ఆందోళన వద్దు

-అర్హు లందరికీ నేతన్నల సేవలో అందిస్తాం
-కొత్త దరఖాస్తుదారులకు ఈనెల 20లోగా ఆర్థిక సాయం
-రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత



## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

2లో



వచ్చే ఏడాది ఇందిరమ్మటవర్స్ నుంచే

# బోనాలు ఎత్తిస్తాం

ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు.

గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతా 2లో

**హైదరాబాద్, అభ్యుదయం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాలేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద



## పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం

-విద్యుత్ సంస్థలపై రుణ భారం తగ్గించేలా నిరంతర చర్యలు
-విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు

- మిగతా 2లో పేజిలో



# ప్రాంతీయ విమాన కనెక్టివిటీ మరింత బలోపేతం



విజయవాడ,: ఆంధ్రప్రదేశ్ ప్రజల కు మరో కీలక విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ అంత ర్జాతీ య విమానాశ్రయం నుంచి పవిత్ర కాశీ నగరం వారణాసికి నేరుగా విమాన సర్వీసులు గురువారం ప్రారంభమయ్యాయి.కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నూతన విమాన సర్వీసులను వర్చువల్‌గా ప్రారంభించారు. విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసులు ప్రారంభం కావడం ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కాశీ యాత్ర మరింత సులభతరం కానుంది.వారణాసి దేశంలోని అత్యంత ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాల్లో ఒకటి. శ్రీ కాశీ విశ్వనాథుడిని దర్శించుకునే భక్తులతో పాటు, విద్య, వ్యాపారం, పర్యాటకం, సాంస్కృతిక అవసరాల కోసం ప్రయాణించే వారికి ఈ నేరుగా విమాన కనెక్టివిటీ ఎంతో ప్రయోజనకరంగా ఉండనుంది. కాగా ఈ విమాన సర్వీసులు వారానికి మూడు రోజుల పాటు మంగళవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉంటాయి.

# పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుపై అధ్యయనం

అమరావతి, రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చేలా సమగ్ర ప్రణాళికలను తయారు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని 130 రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేయాలన్నారు. పోలవరం వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుపై వచ్చిన ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి ఈ సూచన చేశారు. ఈ మేరకు అధ్యయనం చేయడంతోపాటు ఎకనమిక్ ఫీజిబిలిటీపై స్టడీ చేయాలన్నారు.

ఇక ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నందున్న వివిధ రిజర్వాయర్ల ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తి కష్టసాధ్యం కావచ్చనే అంశాన్ని ప్రస్తావిస్తూ విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగం పుంజుకోవడంతో పాటు ప్రతి ఆరేళ్లకూ విద్యుత్ వినియోగం రెట్టింపు అవుతుందని దానికి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.

# ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

## అప్రమత్తంగా ఉండాలన్న సిఇవో

హైదరాబాద్,ఆగస్ట్13 ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపోలడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దరఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్, అ÷ఎ, ం÷ఓ ఖఎెఔలను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఇక్ష కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

## పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి



నిర్వహించనున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారంసంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు.

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర పక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

## పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

న్యూఢిల్లీ,ఆగస్ట్13 అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది.

# ఆందోళన వద్దు ...

అమరావతి,
నేతన్నల సేవలో పథకం కింద అర్హులందరికీ ఆర్థిక సాయం అందిస్తామని, సాంకేతిక కారణాల రీత్యా కొందరికి ఇంకా నగదు జమ కాలేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. నేతన్నలకు ఆర్థిక మేలు కలుగజేయాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు నేతన్నల సేవలో పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే పలువురు నేతన్నలకు రూ.25 వేల ఆర్థిక సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. మిగిలిన వారికి కూడా ఆర్థిక సాయం అందజేస్తామని, అర్హులైన నేతన్నలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి సవిత భరోసా ఇచ్చారు. ఇటీవల వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, వారికి ఈ నెల 20వ తేదీలోగా ఆర్థిక సాయం అందిస్తామని వెల్లడించారు. చేనేతల సంక్షేమం కోరే ప్రభుత్వం తమదని స్పష్టంచేశారు. అర్హులైన నేతన్నల కుటుంబాల్లో ఆనందం చూడాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. వదంతులు, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని, ఏమైనా అనుమానాలు ఉంటే సమీపంలో చేనేత, జౌళి శాఖాధికారులను సంప్రదించాలని మంత్రి సవిత సూచించారు.

# పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

(మొదటి పేజి (తరువాయి)

అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం



నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు.

ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుత ూ..మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం.

బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

హైదరాబాద్,ఆగస్ట్13: రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, సంక్షేమ పథకాల పట్ల అనుసరిస్తున్న దగాకోరు విధానాల వల్లే పేదింటి ఆడపిల్లలకు ఆసరాగా నిలిచే 'కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్' పథకాలపై హైకోర్టుస్టే విధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను రుజువు చేసిందని మండిపడ్డారు. పేద వర్గాలకు ఈ పథకాల ఫలాలు అందకూడదనే దుర్బుద్ధితో, నిధులను ఎగ్గొట్టే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కోర్టు వ్యవహారాల్లో అలసత్వం వహించిందని విమర్శించారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేస్తామని గతంలో అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేసినప్పటికీ, న్యాయస్థానం పలుమార్లు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం బాధ్యతారాహిత్యానికి ప్రత్యక్ష నిదర్శనమని ధ్వజమెత్తారు

# తెలంగాణను దోచుకోవడంలో బిఆర్ఎస్‌తో పోటీ

● కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి రఘునందన్ రావు
● యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్

న్యూఢిల్లీ,ఆగస్ట్13తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోందని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణేనికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ. 202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చింద న్నారు. అయితే, ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘునందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందం ర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియన్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరిం చొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయిం చారని, దానిపైనా విచారణ జరగాల న్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయింపులపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.



# రైలు ఢీకొని టీచర్ మృతి

మహబూబాబాద్,ఆగస్ట్13 జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. పుష్‌పుల్ రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌస్‌మియా మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

# ఆబిడ్స్‌లో మహిళపై దూసుకెళ్లిన కారు

కారు సినీ నిర్మాత పోలీసుల కేసు నమోదు

హైదరాబాద్,ఆగస్ట్13 నగరంలోని అబిడ్స్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గన్‌ఫౌండ్రీ ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత.. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సినిమా నిర్మాత డ్రైవర్ మహేందర్ నడుపుతున్న కారు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో సునీత కాలుకు ఫ్రాక్చర్ కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని..

ఫిల్మ్ ప్రొడ్యూసర్ బొమ్మకు మురళి యజమాని అని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన అనంతరం ఆయనకు ఫోన్ చేసి సునీత చికిత్సకు అయ్యే ఖర్చులను భరించాలని కోరినట్లు చెప్పారు. అయితే డబ్బులు ఇవ్వనని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు వారు వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు.. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంత్యక్రియలకు వచ్చి..

చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత

సంగారెడ్డి,ఆగస్ట్13 జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన గణేశ్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణేశ్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణేశ్‌ను గమనించిన మునిరాజు.. కాపాడేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణేశ్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పు తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల కేసు

హైదరాబాద్,ఆగస్ట్13 హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మాణికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# టెస్సరాక్ట్ సంస్థకు భూకేటాయింపులపై రాజకీయం

న్యూఢిల్లీ,ఆగస్ట్13: టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ. 30లక్షల నుంచి రూ. 80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి.

# సీడ్ యాక్సెస్ రహదారిపై దుష్ప్రచారం

అపోహలకు ఎలాంటి తావు లేదన్న పురపాలక శాఖ

అమరావతి,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): ఏపీ రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రహదారిలోని ఎస్ ఆకారపు మలుపుపై కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ తెలిపింది. అమరావతిని ఇతర ప్రాంతాలతో కనెక్ట్ చేసే ప్రధాన సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణంపై అపోహలకు తావులేదని స్పష్టం చేసింది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని పేర్కొంది. ఈ రహదారి మూడో దశలో విజయవాడ- చెన్నై నేషనల్ హైవే కనెక్టివిటీకి అనుగుణంగా ఈ నిర్మాణం ఉంటుందని చెప్పింది. సీడ్ యాక్సెస్ రహదారిని మణిపాల్ హాస్పిటల్ దగ్గర జాతీయ రహదారితో అనుసంధానం చేసేలా ప్రణాళికలు చేస్తున్నట్లు పురపాలక శాఖ వెల్లడించింది. ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు అనువుగా ప్రస్తుత సీడ్ యాక్సెస్ రహదారి నిర్మాణం ఉంటుందని తెలిపింది. 2017 ప్రణాళిక ప్రకారమే దొండపాడు నుంచి తాడేపల్లి వరకూ ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొంది. రాజధాని అమరావతికి, మంగళగిరి, విజయవాడలతో కనెక్టివిటీ పెంచేలా స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రహదారులు అందుబాటులోకి వచ్చాయని తెలిపింది. సీడ్ యాక్సెస్ రహదారి కనెక్టివిటీ అందుబాటులోకి రావటంతో కృష్ణా కరకట్టపై వాహనాల రద్దీ తగ్గనుందని పేర్కొంది. ఈ వాస్తవాలను గమనించి అపోహలకు గురి కావొద్దని ప్రజలకు పురపాలక శాఖ విజ్ఞప్తి చేసింది.

# రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్లు ప్రారంభించిన చంద్రబాబు

అమరావతి,ఆగస్ట్13: అమరావతి రాజధాని నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. రాజధానిలో నిర్మాణం పూర్తయిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. గురువారం నూతన భవన సముదాయాన్ని సీఎం చేతుల మీదుగా సాధారణ పరిపాలన శాఖ జీఏడీకి సీఆర్డీఏ అప్పగించింది. రాయపూడి వద్ద 12 టవర్లుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస భవన సముదాయాన్ని నిర్మించారు. ఒక్కొక్కటి 3,500 చదరపు అడుగుల వైశాల్యంతో 288 ఫ్లాట్లను సీఆర్డీఏ నిర్మించింది. అత్యాధునిక వసతులతో భవనాలను నిర్మించిన సీఆర్డీఏ.. టవర్ల మధ్య ప్రత్యేక లాన్స్‌ను పెంచింది. అధునాతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఫ్లాట్లను మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్లతో కలిసి సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఇక, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవనాల అప్పగింత అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను సాధారణ పరిపాలన శాఖ చూసుకోనుంది. అనంతరం ప్రభుత్వ నిర్ణయించే విధానానికి అనుగుణంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేటాయింపు ప్రక్రియ చేపట్టే అవకాశం ఉంది.

# డిఎస్సీ కాదు...గ్రూప్ 1 అవతకవకలపై మాట్లాడండి

అమరావతి,ఆగస్ట్13 ఏపీలో 16 వేలకుపైగా డీఎస్సీ ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం పారదర్శకంగా భర్తీ చేసిందని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. మెరిట్ అభ్యర్థికి అన్యాయం జరగకూడదన్నదే చంద్రబాబు ప్రభుత్వ సిద్ధాంతమని స్పష్టం చేశారు. 20 లక్షల ఉద్యోగాల హామీలో భాగంగానే భారీగా ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. డీఎస్సీపై వచ్చిన వందల కేసులను చట్టపరంగా అధిగమించి నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు ప్రతిపక్షం అనవసర రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1పై సిట్ నివేదిక తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తిందని మంత్రి తెలిపారు. 'అర్హత లేని వ్యక్తులతో మూల్యాంకనం చేయించారన్న ఆరోపణలపై సమాధానం ఏదని ప్రశ్నించారు. ప్రైవేట్ రిసార్టుల్లో ఆన్సర్‌షీట్ల మూల్యాంకనం ఎందుకు జరిగింది? సీసీ కెమెరాలు, అధికారిక పర్యవేక్షణ లేకుండా మూల్యాంకనం ఎలా జరిగింది? ఖజానా ఆధీనంలో ఉండాల్సిన ఆన్సర్‌షీట్లు ప్రైవేట్ ప్రదేశానికి ఎలా చేరాయి? వ్యక్తిగత ఉపజీవి ఖాతాలు, ఉనికిన్ని+ ఆనతిలల ద్వారా మూల్యాంకనం జరిగిందన్న ఆరోపణలకు వివరణ ఏది?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. మూల్యాంకన ప్యానెల్ అర్హతలపై వచ్చిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# చంద్రగిరిలో ఏనుగుల హల్‌చల్

పంటపొలాలను ధ్వంసం చేసినట్లు రైతుల వెల్లడి

తిరుపతి,ఆగస్ట్13(ఆర్ఎన్ఎ): జిల్లాలోని చంద్రగిరి మండలం యల్లంపల్లిలో మరోసారి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి గ్రామ పరిసరాల్లోకి సుమారు 15 ఏనుగులు చొరబడి పంట పొలాలపై దాడి చేశాయి. వరి పంటతో పాటు పశువుల కోసం సాగు చేసిన గడ్డి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. రైతులకు చెందిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాత్రివేళ ఏనుగుల గుంపు ఒక్కసారిగా పంట పొలాల్లోకి రావడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడితో నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు మళ్లీ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండటంతో యల్లంపల్లి ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఏనుగులు ఎప్పుడు, ఎటువైపు నుంచి వస్తాయో తెలియక రైతులు రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు. పంట నష్టానికి పరిహారం అందించడంతో పాటు ఏనుగులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో అటవీ అధికారులు రంగంలోకి దిగి ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్నారు. ఏనుగుల గుంపును సురక్షితంగా అటవీ ప్రాంతం వైపు తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

● ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు
● మాజీ స్పీకర్ పోచారం మరోమారు హాట్ కామెంట్స్



కామారెడ్డి,ఆగస్ట్13 అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌కి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండ వన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పాననని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతానని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసాగింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉంటుంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు. ప్రజల కోసమే నా జీవితం' అని స్పష్టం చేశారు. పోరాటం చేస్తా తప్ప, తల వంచే రాజకీయం చేయనని స్పష్టం చేశారు. ప్రజల కోసం, నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏమైనా చేస్తానన్నారు. ఎమ్మెల్యేకు ప్రభుత్వ సహకారం కావాలని.. ప్రభుత్వ సహకారం లేకుంటే ఏమి చేయలేమని పోచారం శ్రీనివాస రెడ్డి వెల్లడించారు.

# వివాహేతర సంబంధంతో హత్య

నగర్ కర్నూల్,ఆగస్ట్13: నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం కోట్ర గ్రామానికి చెందిన వివాహిత దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్ర గ్రామానికి చెందిన నారుమళ్ల అనూష(22) కల్వకుర్తి పట్టణంలోని ఓ లేడీస్ కార్నర్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త చెన్నయ్య ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. అనూష గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తితో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది.

ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రాములు.. అనూషను ఒడ్డోనిరాళ్ల వద్దకు తీసుకెళ్లి హత్య చేసి, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించి దహనం చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హత్యకు పాల్పడిన రాములుతోపాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కల్వకుర్తి, వెల్దండ సీఐలు భీమ్‌కుమార్, రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

## బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు
# తీజ్ పండుగ ప్రతీక

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్...
- జై సేవాలాల్ భూక్యా రెడ్డి తండాలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు...



కొనరావుపేట, ప్రతినిధి:కొనరావుపేట మండలం జై సేవాలాల్ భూక్యా రెడ్డి తండాలో తీజ్ పండుగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై తీజ్ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. తీజ్ పండుగ బంజారా సమాజం యొక్క గొప్ప సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను ప్రతిబింబించే ముఖ్యమైన పండుగ అని అన్నారు. బంజారా మహిళలు, యువతులు ఎంతో భక్తిశ్రద్ధలతో తీజ్ పండుగను జరుపుకోవడం అభినందనీయమన్నారు. బంజారా సంస్కృతి, కళలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. తీజ్ వేడుకల్లో భాగంగా మహిళలు, యువతులు సంప్రదాయ బంజారా దుస్తులు ధరించి తీజ్ పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. దీంతో తండాలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన తండా ప్రజలను, మహిళలను, యువతను సర్పంచ్ బానోత్ నరేష్ నాయక్ అభినందించారు. తీజ్ పండుగ బంజారా సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని అన్నారు. ఈ సందర్భంగా జై సేవాలాల్ భూక్యా రెడ్డి తండా ప్రజలకు తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి, సమృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బండ నర్సయ్య, గుడి చైర్మన్ రాజు నాయక్, లకవత్ రాజు, అవినాష్, మహిళలు, యువతులు, తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఖర్గేకు అవమానం..
## వరంగల్‌లో కాంగ్రెస్ భారీ నిరసన



వరంగల్ ఆగస్టు 13
ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్ల జరిగిన వివక్షపూరిత, అవమానకర చర్యను నిరసిస్తూ వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ తెలిపారు. వెంకట్రామ జంక్షన్ నుంచి ప్రారంభమయ్యే భారీ యాత్ర కాశీబుగ్గలోని అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగనుంది. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహం నిర్వహించనున్నారు. ఖర్గేకు జరిగిన అవమానాన్ని ఖండిస్తూ, ఆయనకు సంఘీభావం తెలిపేందుకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అయూబ్ పిలుపునిచ్చారు.

రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా పరిధిలోని పీసీసీ సభ్యులు, డీసీసీ కమిటీ సభ్యులు, మండల, పట్టణ, డివిజన్ కాంగ్రెస్ కమిటీల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఎలాంటి మినహాయింపు లేకుండా కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని టీపీసీసీ ఆదేశించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడికి సంఘీభావంగా నిర్వహిస్తున్న ఈ భారీ యాత్ర, సత్యాగ్రహాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కదిలిరావాలని మహమ్మద్ అయూబ్ కోరారు.

## గౌరవెల్లి ప్రాజెక్ట్ భూసేకరణ
## ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి



హనుమకొండఆగస్టు 13, 2026గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలోకి వస్తున్న జిల్లాలోని ఆయా మండలాల్లో భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి ఆదేశించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ కార్యాలయంలో గౌరవెల్లి ప్రాజెక్ట్ భూ సేకరణ, పరిహారం చెల్లింపు, ప్రక్రియను వేగవంతం చేసే చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశములో గౌరవెల్లి ప్రాజెక్ట్ కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పురోగతి, భూములకు పరిహారం చెల్లింపు వివరాలను అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. భూ సేకరణ ప్రక్రియ, అవార్డు, పేమెంట్ వివరాలను గురించి సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్ట్ భూసేకరణ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

# ఒకే ఒక్కడు

- మియాపూర్ జి.హెచ్.ఎం.సి సర్కిల్ 48 పరిధిలో అడ్డు, అదుపు లేని అక్రమ నిర్మాణాలు.
- ఇక్కడ అక్రమ నిర్మాణాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రమే, టౌన్ ప్లానింగ్ విభాగంలో కిందిస్థాయి సిబ్బంది అంతా రింగు మాస్టర్ కనుసన్నల్లోనే పనిచేయాలి.
- అక్రమ నిర్మాణం పని నడవాలన్నా.. పని ఆపాలి అన్నా..ఆ భవనం సీజింగ్ చేయాలన్నా..వాళ్ల దగ్గర భారీ మొత్తంలో వసూళ్లు చేయాలన్నా.. టౌన్ ప్లానింగ్ విభాగంలో గత కొన్నేళ్లుగా కంటిమీద కునుకు లేకుండా, సెలవు దినాల్లో కూడా వీధిలో నిర్వహించే అత్యంత నిబద్ధత గల ఉద్యోగి ఒకే ఒక్కడు టౌన్ ప్లానింగ్ రింగ్ మాస్టర్.



మియాపూర్ సర్కిల్ జి.హెచ్.ఎం.సి కార్యాలయం.


మియాపూర్, మక్త మహబూబ్ పేటలో అనుమతికి మించి భారీ నిర్మాణాలు.

**అభ్యుదయం. మియాపూర్.**

నగరంలో అన్ని ప్రాంతాల్లో లాగే ఇక్కడ కూడా తీసుకున్న అనుమతులకు భవన నిర్మాణాలకు ఏమాత్రం పొంతన ఉండదు, అత్యంత ఖరీదైన హైటెక్ సిటీ ప్రాంతంలో ఉన్న ఈ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు కూడా అదే స్థాయిలో ఉంటాయి. గత కొంత కాలంలో అక్కడక్కడ నిర్మాణాలు ఉండి మిగతా ప్రాంతమంతా ఎక్కువ శాతం ఖాళీగా ఉండేది ఇప్పుడు దానికి భిన్నంగా ఈ ప్రాంతమంతా భారీ నిర్మాణాలతో అనేక కాలనీలు ఏర్పడ్డాయి. ఉన్న స్థలాన్ని బట్టి తీసుకున్న అనుమతి కన్నా అక్రమంగా నిర్మించే అంతస్తులే ఇక్కడ ఎక్కువ. నిత్యం ఏ మూల చూసినా అనుమతికి మించి అక్రమ నిర్మాణాలు నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి. ఈ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణం పై నోటీసులు ఇవ్వాలన్నా, సీజింగ్ చేయాలన్నా, కూల్చివేతలు జరపాలన్నా, పని ఆపాలన్నా అదే పని తిరిగి కొనసాగాలన్నా, అనంతరం వాళ్లని దారికి తెచ్చుకుని వాళ్ల నుంచి లక్షల్లో వసూలు చేయాలన్న టౌన్ ప్లానింగ్ లో ఒకే ఒక్కడు రింగ్ మాస్టర్. గత కొన్ని సంవత్సరాలుగా స్థలం ఉన్న విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో స్లాబ్ కు రెండు నుండి ఐదు లక్షల వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు అనధికారకంగా అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ కోట్లల్లో దండుకుంటున్నా, ఉమ్మడి చందానగర్ సర్కిల్ నుండి ఇప్పుడు మియాపూర్ ప్రత్యేక సర్కిల్ ఏర్పడిన గత పది, పదిహేను సంవత్సరాల వ్యవదిలో టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారుల చేతికి మట్టి అంటకుండా ఒకే ఒక్క అవుట్సోర్సింగ్ ఉద్యోగి


మియాపూర్ రెడ్డి కాలనీలో అనుమతిలేని అక్రమ నిర్మాణం


మియాపూర్, లక్కీ రెస్టారెంట్ వెనుక అనుమతికి మించి భారీ నిర్మాణం.

కనుసన్నల్లోనే ఈ లావాదేవీల వ్యవహారమంతా జరగడం గమనార్హం. బాహాటంగా ఇంత అవినీతి జరుగుతున్నా విజిలెన్స్ అధికారులు కానీ, అవినీతి నిరోధక శాఖ అధికారులు గానీ ఇప్పటిదాకా ఒక్కసారికూడా ఈ కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఇప్పటికైనా ఈ కార్యాలయ పరిధిలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ అధికారులతో పాటు అవినీతి నిరోధక శాఖ అధికారులు సైతం దృష్టిసారించాలని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సి.ఎం.సి కమిషనర్ దీనిపై స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి అక్రమ నిర్మాణాలను అరికట్టి, బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు


మియాపూర్ రెడ్డి కాలనీలో అనుమతి లేని నిర్మాణం

డిమాండ్ చేస్తున్నారు.

# విజయ డైరీ పునరుద్ధరణకు త్వరలో చర్యలు

**- పాడి రైతులకు అండగా నిలిచి, పాల ఉత్పత్తిని పెంచాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**
**- రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యంగా కార్యాచరణ**



హనుమకొండ, ఆగస్టు 13,
విజయ డైరీ పునరుద్ధరణకు త్వరలోనే చర్యలు చేపడతామని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. రైతులు పశుపోషణపై దృష్టి సారించడం ద్వారా వ్యవసాయంతో పాటు నిరంతర ఆదాయాన్ని పొందవచ్చని, రైతులు తమ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన పశువులను స్వయంగా ఎంపిక చేసుకోవడం ద్వారా పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.గురువారం కలెక్టర్ విజయ డైరీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాల సేకరణ కేంద్రం, పాల శీతలీకరణ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, పాలు పరీక్షించే ప్రయోగశాలను పరిశీలించి, అక్కడి కార్యకలాపాలు, పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలు, పాల ఉత్పత్తుల తయారీ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం పాడి రైతుల సంక్షేమ సంఘం సభ్యులు, రైతులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు పశు వులను పోషించడం ద్వారా నిరంతర ఆదాయం పొందడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించడంలో భాగస్వాములు కావచ్చని అన్నారు.విజయ డైరీతో పశుసంవర్ధక శాఖను అనుసంధానం చేసి, పాడి రైతులకు ఆధునిక పశు పోషణ పద్ధతులు, పశువుల ఎంపిక, పశువైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం సంబంధిత శాఖల అధికారులతో త్వరలోనే సమన్వయ సమావేశం నిర్వహించి కార్యాచరణ రూపొందిస్తామని కలెక్టర్ తెలిపారు.ప్రజలకు మరింత నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించే దిశగా విజయ డైరీ కృషి చేయాలని సూచించారు. ఎలాంటి రసాయనాలు కలపకుండా స్వచ్ఛమైన పాలను అందించేందుకు విజయ డైరీ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విజయ డైరీకి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు పాలతోపాటు నెయ్యి, పన్నీరు తదితర ఇతర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు, మౌలిక వసతులను సమకూర్చేందుకు చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని తెలిపారు. 26 సొసైటీల ద్వారా పాలను సేకరించి, పాలతోపాటు ఇతర పాల ఉత్పత్తులను విజయ డైరీ ద్వారా తయారు చేసి, డిస్ట్రిబ్యూటర్ల ద్వారా మార్కెట్‌లో విక్రయిస్తున్నామని వివరించారు.గతంలో విజయ డైరీ ద్వారా నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసి అందించేవారమని, పాల సేకరణ తగ్గిపోవడంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా



గణనీయంగా తగ్గిందని తెలిపారు. రైతులు పశు పోషణపై మరింత దృష్టి సారించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.విజయ డైరీ ద్వారా రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని చేరుకునేలా రైతులను పాడి పరిశ్రమ వైపు ప్రోత్సహించేందుకు కార్యాచరణ చేపడుతున్నామని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.



## కేఎల్ రాహుల్ మా ఎక్స్‌ఫ్యాక్టర్..

### టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమైంది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. ఈ క్రమంలో ఈ సిరీస్‌ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. అయితే ఈ సిరీస్‌లో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తమ ఎక్స్‌ఫ్యాక్టర్ అని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మోర్కెల్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందని, అది జట్టుకు ఉపయోగపడుతుందని తెలిపాడు.'టెస్ట్‌ల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. శ్రీలంక కండీషన్స్, పిచ్‌లపై అతనికి అపారమైన అనుభవం ఉంది. అతనికి ఉన్న ఈ అనుభవం యువ ఆటగాళ్లకు ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎంతగానో ఉపయోగపడింది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా మా ప్లేయర్స్ వ్యక్తిగతంగా తమ ఆటను ఎంతో మెరుగుపరుచుకున్నారు. ఈ సిరీస్‌ను గెలవడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేశాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ తెలిపాడు. గాలె పిచ్ కండిషన్స్ పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఓవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే.. మరో వైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకు రాగలరని తెలిపాడు. 'గాలే పిచ్ చూడటానికి మంచి వికెట్‌లా కనిపిస్తోంది.

# శ్రీలంక పర్యటనలో పడిక్కల్ చెలరేగుతాడు

### మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం




శ్రీలంక పర్యటనలో టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చెలరేగుతాడని మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం చెప్పాడు. శ్రీలంక కండిషన్స్ అతని బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సాయి సుదర్శన్ గాయంతో ఈ పర్యటనకు దూరమవడంతో పడిక్కల్‌కు మార్గం సుగుమమైంది. అంతేకా కుండా వామప్ మ్యాచ్‌లో అతను అద్భుతమైన శతకంతో చెలరేగాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన రహానే.. పడిక్కల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గురించి ఆలోచించకుండా.. టెస్ట్ సిరీస్‌పై ఫోకస్ పెట్టాలని సూచించాడు. శ్రీలంక జట్టును ఏ మాత్రం తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించాడు. 'శ్రీలంక కండిషన్స్ దేవదత్ పడిక్కల్‌కు సరిగ్గా సరిపోతాయి. అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు కాబట్టి.. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఒకసారి క్రీజులో కుదురుకున్న తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అతను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. ఫ్రంట్ ఫుట్, బ్యాక్ ఫుట్ షాట్స్‌తో అతని వద్ద పూర్తి స్థాయి బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. అయితే మూడో స్థానంలో ఆడే బ్యాటర్ ముందు చూపుతో ఆడాల్సి ఉంటుంది.

ఒకవేళ మూడో స్థానం బ్యాటర్ రాణిస్తే.. జట్టు మొత్తం ఆధిపత్యం చెలాయించగలదు. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ అతను మంచి రిథమ్‌లో కనిపిస్తున్నాడు. అతను తన ఫామ్, రిథమ్ నమ్ముకొని ఆడాలి. తనపై తాను అనవసర ఒత్తిడి పెంచుకోకుండా ఉండటం ముఖ్యం. అతనికి పరుగులు ఎలా చేయాలో తెలుసు. స్పిన్నర్లపై కట్, స్వీప్, స్టెప్ ఔట్ షాట్స్‌తో ఎదురుదాడి చేయగలడు.'అని రహానే చెప్పుకొచ్చాడు. భారత్ డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించి శ్రీలంకను తేలికగా తీసుకోకూడదని రహానే హెచ్చరించాడు. 'డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీలంకను తేలికగా తీసుకోకూడదు. భారత్ ముందుగా తొలి టెస్ట్ గెలవడంపై ఫోకస్ పెట్టాలి. ఆ తర్వాతే రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గురించి ఆలోచించాలి. కీలకమైన క్షణాలను గుర్తించి ఆధిపత్యం చెలాయిస్తేనే సిరీస్ కైవసం అవుతుంది. ఈ సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఎందుకంటే టెస్ట్‌ల్లో బాగా రాణించాలనే కసితో శ్రీలంక కూడా ఉంది. ఈ సిరీస్ ఏ మాత్రం ఏకపక్షంగా ఉండదని నేను భావిస్తున్నా.'అని అజింక్యా రహానే అన్నాడు.

# తొలి టెస్ట్‌లో స్నీకో వివాదంపై దుమారం




ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో స్నీకో వివాదం తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ సాయంతో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బంగ్లాదేశ్ యువ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.అయితే ఇన్నింగ్స్ ఆరంభంలోనే అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టెక్నాలజీ సాయంతో బచాయించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎబాడోట్ హొస్సేన్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి స్టీవ్ స్మిత్ బ్యాట్‌కు దగ్గరగా వెళ్తూ కీపర్ చేతిలో పడింది. దాంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వికెట్ కోసం అప్పీల్ చేశారు. స్మిత్ కూడా ఔటేనని భావించి పెవిలియన్ వైపు నడిచాడు. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన ఔటివ్వకపోవడంతో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ షాంటో రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పైక్ కనిపించలేదు. దాంతో స్మిత్ తిరిగి బ్యాటింగ్ చేపట్టాడు. అయితే ఈ నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. టెక్నాలజీలో లోపం ఉందని నెటిజన్లు ఆరోపించారు. ఆస్ట్రేలియా ఛీటింగ్ చేసిందని మండిపడ్డారు.తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో ఈ ఘటనపై స్మిత్ స్పందించాడు. తాను ఔటనే భావించానని, కానీ బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదన్నాడు. 'నేను ఔటయ్యాననే భావించాను. నేను చాలా అదృష్టవంతుడిని. టెక్నాలజీనే నన్ను కాపాడింది. ఒకవేళ అంపైర్ ఔటిచ్చి ఉంటే నేను వెళ్లిపోయే వాడిని. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. అయితే బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయాన్ని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ బ్యాట్‌కు తాకినట్లు నాకు అనిపించింది.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హొస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు.

# భారత్‌తో టెస్ట్ కు శ్రీలంక జట్టు ప్రకటన



రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను




శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్‌వెల్లాకు పిలుపు దక్కింది. 2023లో శ్రీలంక తరఫున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది. ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్-ఏ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది.

**భారత్‌తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్:**

ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ద్రువాల్నాండో, ఎఫ్‌సి ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.

## సంపాదకీయం

# పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు !

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టుబండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డుకుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవహారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పించుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపోయాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రాహుల్ పట్టుపడుతూ వచ్చారు.

అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్దంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బంలగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసుకుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు

గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరితీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం

- భూముల జాడలేకుండా మాయం
- రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ



హైదరాబాద్,ఆగస్ట్13: రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మకానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నాయని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుకన్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడానికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికార్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందించాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవుపలికారు. అనుముల బ్రదర్స్ ప్రయోజనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ

### ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్13 ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమాచారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్రవాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావించినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్నదనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవకాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తున్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి. అల్‌ఖైదా తన కార్యకలాపాలను విస్తరించేం దుకు ప్రాంతీయ నెట్‌వర్క్‌లను ఉపయోగిం చుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు



ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ

### పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు

### అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన



న్యూఢిల్లీ,ఆగస్ట్13 పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

# ఆదర్శంగా నిలిచిన రాజ్యసభ ఎంపి విజయ్



న్యూఢిల్లీ,ఆగస్ట్13 రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ గొప్ప మనసును చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. అమరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాలకు ఎంపీ అండగా నిలిచారు. ఎంపీగా తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును భారత కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజయ్ స్వయంగా అందజేశారు.

దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణత్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. అందులో భాగంగానే ఈ చిరు సాయం చేసినట్లు విజయ్ స్పష్టం చేశారు. పదవి చేపట్టిన వెంటనే తొలి వేతనాన్ని సైనికుల కుటుంబాల కోసం వెచ్చించడం పట్ల విజయ్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.



#### అపోలో హాస్పిటల్స్ లాభంలో

## 38 శాతం వృద్ధి

హైదరాబాద్ అపోలో హాస్పిటల్స్.. జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికం (క్యూ1)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.610.40 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 38.4 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కార్యకలాపాల ఆదాయం రూ.5,842.10 కోట్ల నుంచి రూ.7,043.50 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో హెల్త్‌కేర్ సర్వీసుల ఆదాయం రూ.2,973.80 కోట్ల నుంచి రూ.3,619.50 కోట్లకు పెరగగా డిజిటల్ హెల్త్, ఫార్మసీ డిస్ట్రిబ్యూషన్ ఆదాయం రూ.2,471.90 కోట్ల నుంచి రూ.2,977 కోట్లకు పెరిగింది. డయాగ్నోస్టిక్స్ విభాగం రెవెన్యూలు రూ.499.50 కోట్లుగా ఉన్నాయి. కాగా గురుగ్రామ్‌లో ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తృతీయ త్రైమాసికంలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపింది. అలాగే ఇండోర్, ద్వారక, ఢిల్లీ ప్రోటాన్ సెంటర్, రాంచీల్లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న హాస్పిటల్స్‌తో పాటు ఇండోర్, గువాహతిల్లోని ప్రస్తుత హాస్పిటల్స్ విస్తరణను చేపడుతున్నట్లు తెలిపింది.

# ఏఐతో ఉద్యోగాలు తగ్గిపోవు..

## మార్క్ జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు..




కృత్రిమ మేధస్సుకారణంగా భారీగా ఉద్యోగాలు కనుమరుగవుతాయన్న ఆందోళనల మధ్య మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ కారణంగా కంపెనీల పరిమాణం తగ్గినప్పటికీ, మొత్తంగా ఉద్యోగాల సంఖ్య తగ్గదని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. జుకర్‌బర్గ్ ఆగస్టు 10న మెటా వెబ్‌సైట్‌లో ఒక వ్యాసాన్ని పోస్ట్ చేశార ఆ వ్యాసంలో ఏఐ భవిష్యత్తు, ఉద్యోగాలు, వ్యాపారాలపై జుకర్‌బర్గ్ తన అభిప్రాయాలను వెల్లడించారు. ఏఐ మానవుల ప్రాధాన్యతను పూర్తిగా తొలగిస్తుందని భావించడం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కంపెనీల పరిమాణం తగ్గే అవకాశం ఉందని జుకర్‌బర్గ్ అన్నారు. అయితే దాని అర్థం ఉద్యోగాలు తగ్గిపోవడం కాదని స్పష్టం చేశారు. తక్కువ మంది ఉద్యోగులతో పనిచేసే మరిన్ని చిన్న కంపెనీలు ఏర్పడొచ్చన్నారు. అవి ఏఐ సహాయంతో పెద్ద సంస్థల స్థాయిలో ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు.

చిన్న వ్యాపారాల అభివృద్ధికి ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిన్న వ్యాపారాలు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా కొనసాగుతాయని, ఏఐ కారణంగా ఒక్కో చిన్న సంస్థ ప్రభావం మరింత పెరుగుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ప్రతిసారీ కొత్త ఉద్యోగాలు పుట్టుకొచ్చాయని జుకర్‌బర్గ్ గుర్తుచేశారు. ఒక తరం క్రితం యాప్ డెవలపర్లు, సామాజిక మాధ్యమ కంటెంట్ సృష్టికర్తలు, విద్యుత్ వాహన సాంకేతిక నిపుణులు, డేటా సెంటర్ ఉద్యోగాలు ఇంతగా ఉండేవి కావని పేర్కొన్నారు

ఏఐ విస్తరణతో ప్రస్తుతం ఊహించలేని కొత్త రకాల ఉద్యోగాలు కూడా పుట్టుకొస్తాయని ఆయన అన్నారు (ూ× ఖఅఃస జుఎజూశ్రీశీఎవవత్). ఏఐ ప్రధానంగా ఆటోమేషన్ సాధనంగా కాకుండా కొత్త ఆవిష్కరణలకు ఉపయోగపడే సాధనంగా మారొచ్చని జుకర్‌బర్గ్ అభిప్రాయపడ్డారు. ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాల స్వరూపం తప్పకుండా మారుతుందని, అయితే ఆ మార్పు మొత్తం ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగాల కొరతకు దారితీయకపోవచ్చని పేర్కొన్నారు.




## టాటాకు చంద్ర వీడ్కోలు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద వ్యాపార సామ్రాజ్యమైన టాటా గ్రూప్‌లో మరో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఈ గ్రూప్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవికి నటరాజన్ చంద్రశేఖరన్ (చంద్ర) వీడ్కోలు పలికారు. 2027 ఫిబ్రవరి 20తో ముగియనున్న ప్రస్తుత పదవీకాలం తర్వాత పునర్నియామకాన్ని కోరుకోవట్లేదని ఆయన బుధవారం ప్రకటించారు. టాటా సన్స్ చైర్మన్‌గా ఆయనకు ఇది రెండో టర్మ్. మూడోసారి తననే కొనసాగించాలనే విషయంపై టాటా సన్స్ బోర్డు సభ్యులు, టాటా ట్రస్ట్‌ల మధ్య భేధాభిప్రాయాలు నెలకొనడంతో పాటు నోయల్ టాటాతో విభేధాల కారణంగా టాటా ట్రస్ట్‌ల బోర్డు సభ్యులు కూడా ఒక్కరొక్కరుగా తప్పుకుంటున్న నేపథ్యంలో చంద్ర ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అంతేకాదు, ఈ నెల 18న నిర్వహించనున్న టాటా సన్స్ వార్షిక వాటాదారుల సమావేశం (ఏజీఎం)లో చంద్ర పునర్నియామకంపై ఓటింగ్ జరగాల్సి ఉంది. అందులో ఏకగ్రీవ మద్దతు లభించే అవకాశాలు లేకపోవడంతో గౌరవప్రదంగా తప్పుకోవడం మేలని భావించే చంద్ర ఈ ప్రకటన చేసి ఉంటారని విశ్లేషకులు పేర్కొన్నారు. టీసీఎస్, టాటా మోటార్స్, ఎయిరిండియా సహా టాటా గ్రూప్‌లోని 30 కీలక కంపెనీల ప్రమోటరే టాటా సన్స్. ఈ సంస్థలో టాటా ట్రస్ట్‌లు మొత్తం 66 వాటా కలిగి ఉన్నాయి. చంద్ర పదవీకాలాన్ని మరో ఐదేళ్లు పొడిగించాలని కంపెనీలో మెజారిటీ వాటా (51.54 శాతం) వాటా కలిగిన సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్ ఏకగ్రీవంగా ప్రతిపాదించాయి. టాటా సన్స్ నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ కమిటీ ఆ ప్రతిపాదనను ఆమోదించడంతో పాటు కంపెనీ బోర్డుకు కూడా సిఫారసు చేసింది.

## బొప్పాయి ఆకుల రసాన్ని సేవిస్తే నిజంగానే ప్లేట్‌లెట్లు పెరుగుతాయా..



బొప్పాయి ఆకుల రసాన్ని సేవిస్తే నిజంగానే ప్లేట్‌లెట్లు పెరుగుతాయా..

అనేక బయో యాక్టివ్ సమ్మేళనాలు..

బొప్పాయి ఆకుల్లో కార్పైన్, ఫ్లేవనాయిడ్లు, క్వెర్సెటిన్, కెంప్ఫెరోల్, క్లోరోజెనిక్ యాసిడ్, పపైన్, కైమోపపైన్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉన్న పదార్థాలుగా ఉన్నాయి. అలాగే బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్‌లో రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడంలో సహాయపడే కొన్ని లక్షణాలు ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. డెంగీ రోగుల్లో బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్ ప్రభావంపై బీఎంసీ కాంప్లిమెంటరీ అండ్ ఆల్టర్నేటివ్ మెడిసిన్, ప్లస్ వన్ వంటి జర్నల్స్‌లో పరిశోధనలు ప్రచురితమయ్యాయి. కొన్ని అధ్యయనాల్లో బొప్పాయి ఆకుల ఎక్స్‌ట్రాక్ట్ తీసుకున్నవారిలో రక్తంలోని ప్లేట్‌లెట్ కౌంట్ 50,000/బూ కంటే ఎక్కువగా పెరిగే అవకాశం కనిపించింది. అయితే ఈ పరిశోధనలు పరిమిత సంఖ్యలో డెంగీ రోగులపై జరిగాయి. అందువల్ల బొప్పాయి ఆకులు డెంగీ రోగులందరిలోనూ ప్లేట్‌లెట్ కౌంట్‌ను కచ్చితంగా పెంచుతాయని నిర్ధారించడానికి మరింత విస్తృతమైన పరిశోధనలు అవసరం. బొప్పాయి ఆకుల రసం శరీరంలో సులభంగా శోషణకు గురవుతుందని, ప్లేట్‌లెట్ కౌంట్ పెరగడానికి సహాయపడుతుంని నిపుణులు చెబుతున్నారు. అయితే ఎంత పరిమాణంలో, ఎప్పుడు తీసుకోవాలనే విషయంలో జాగ్రత్త అవసరం. అంతేకాకుండా బొప్పాయి ఆకుల రసం చాలా చేదుగా ఉండటం వల్ల కొంతమందికి దాన్ని తట్టుకోవడం కష్టంగా ఉంటుంది.

సహాయక చర్య మాత్రమే..

అయితే బొప్పాయి ఆకుల రసం డెంగీను పూర్తిగా నయం చేస్తుందని భావించడం తప్పు. ఇది గరిష్ఠంగా సహాయక చర్యగా మాత్రమే పరిగణించాలి. ముఖ్యంగా ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచే అవకాశం మాత్రమే దాని పరిశోధనల్లో కనిపించింది. డెంగీ చికిత్సకు బొప్పాయి ఆకుల రసం వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. బొప్పాయి ఆకుల రసం తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా కనిపిస్తాయి. కడుపులో అసౌకర్యం, వికారం, అలర్జిక్ రియాక్షన్లు వంటి సమస్యలు వస్తాయి. గర్భిణీలు దీనిని తీసుకునే విషయంలో ప్రత్యేకంగా జాగ్రత్త వహించాలి. అలాగే డెంగీ చికిత్సలో ఉపయోగించే కొన్ని మందులతో ఇది పరస్పర ప్రభావం చూపే అవకాశం ఉండడంతో, వైద్యుల సలహా లేకుండా తీసుకోవడం మంచిది కాదు. డెంగీ ఉన్నట్లు అనుమానం వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి. కొంతమందికి ఆసుపత్రిలో చికిత్స అవసరం అవుతుంది. మరికొందరు ఇంట్లోనే చికిత్స పొందినా, వైద్యుల సూచన మేరకు రక్త పరీక్షలు, ప్లేట్‌లెట్ కౌంట్‌ను పర్యవేక్షిస్తూ ఉండాలి. ముఖ్యంగా డెంగీ సమయంలో కనిపించే హెచ్చరిక లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా అవసరమైనప్పుడు వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.



## చిలగడదుంపల్లో నిజంగానే విటమిన్ ఎ ఉంటుందా..

చిలగడదుంపను సాధారణంగా రుచికరమైన దుంపగా మాత్రమే చూస్తారు. కానీ ఇందులో విటమిన్ ఎ, బీటా కెరోటిన్, ఫైబర్, పొటాషియం, విటమిన్ సి వంటి పలు పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా నారింజ రంగులో ఉండే చిలగడదుంపల్లో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది శరీరానికి అవసరమైనప్పుడు విటమిన్ ఎ గా మారుతుంది. అందుకే చిలగడదుంపను ఆహారంలో భాగంగా చేర్చుకోవడం వల్ల కంటి ఆరోగ్యం, రోగనిరోధక శక్తి, చర్మ ఆరోగ్యానికి ప్రయోజనం కలుగుతుంది. చిలగడదుంపలో ఉండే బీటా కెరోటిన్‌నే దాని అధిక విటమిన్ ఎ స్థాయికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. మధ్యస్థ పరిమాణంలో ఉండే ఒక చిలగడదుంపలో సుమారు 961 మైక్రోగ్రాముల ఆర్ఏఈ విటమిన్ ఎ లభిస్తుంది. ఇది చాలా మంది పెద్దలకు రోజువారీగా అవసరమైన మొత్తాన్ని మించిపోయే స్థాయి. అయితే చిలగడదుంపలోని విటమిన్ ఎ నేరుగా లభించదు. ఇందులోని బీటా కెరోటిన్ శరీర అవసరాన్ని బట్టి విటమిన్ ఎగా మారుతుంది.

ాంజవటీఅంవవవత్

రకాన్ని బట్టి మారే విటమిన్ ఎ..

చిలగడదుంపల్లో ఉండే విటమిన్ ఎ పరిమాణం వాటి రకాన్ని బట్టి మారుతుంది. నారింజ రంగు చిలగడదుంపల్లో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఊదా రంగు చిలగడదుంపల్లో ఆంథోసయానిన్లు ఎక్కువగా ఉంటాయి కానీ విటమిన్ ఎ పరిమాణం నారింజ రకంతో పోలిస్తే తక్కువగా ఉంటుంది. తెలుపు రంగు చిలగడదుంపల్లో కెరోటినాయిడ్ పిగ్మెంట్లు చాలా తక్కువగా ఉండటం వల్ల విటమిన్ ఎ కూడా తక్కువగా ఉంటుంది. చిలగడదుంపల్లోని విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి ఉపయోగకరంగా ఉంటుంది. సాధారణ చూపుతోపాటు రాత్రి సమయంలో చూపు సరిగా ఉండేందుకు విటమిన్ ఎ అవసరం. కంటి ముందు భాగాన్ని రక్షించే కార్నియాను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది. రెటీనాలో కాంతిని గుర్తించడంలో సహాయపడే రోడోప్సిన్ అనే పదార్థం ఏర్పడటానికి విటమిన్ ఎ అవసరం. విటమిన్ ఎ లోపిస్తే రాత్రి చూపు తగ్గే అవకాశం ఉంటుంది. రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి కూడా విటమిన్ ఎ అవసరం. రోగనిరోధక వ్యవస్థల పనితీరులో కీలకపాత్ర పోషిస్తుంది.

## జీర్ణవ్యవస్థలో ఉండే బ్యాక్టీరియా ఊబకాయానికి కారణమవుతాయా..?

జీర్ణవ్యవస్థలో ఉండే బ్యాక్టీరియా ఊబకాయానికి కారణమవుతాయా..?

అధ్యయనంలో ఏం తేలింది..? మన శరీర ఆరోగ్యంపై పేగుల్లో ఉండే సూక్ష్మజీవుల ప్రభావం ఎంత ముఖ్యమో ఇటీవలి పరిశోధనలు మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. జీర్ణవ్యవస్థలో ఉండే ఈ బ్యాక్టీరియా సమూహాన్ని గట్ మైక్రోబయోటా అంటారు. ఇవి మన జీవక్రియపై ప్రభావం చూపడమే కాకుండా ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, టైప్-2 మధుమేహం వంటి సమస్యలతో కూడా సంబంధం కలిగి ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

మన శరీర ఆరోగ్యంపై పేగుల్లో ఉండే సూక్ష్మజీవుల ప్రభావం ఎంత ముఖ్యమో ఇటీవలి పరిశోధనలు మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. జీర్ణవ్యవస్థలో ఉండే ఈ బ్యాక్టీరియా సమూహాన్ని గట్ మైక్రోబయోటా అంటారు. ఇవి మన జీవక్రియపై ప్రభావం చూపడమే కాకుండా ఊబకాయం, గుండె సంబంధిత వ్యాధులు, టైప్-2 మధుమేహం వంటి సమస్యలతో కూడా సంబంధం కలిగి ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

కొంతమంది వ్యక్తుల్లో పేగుల్లో ఉండే కొన్ని రకాల బ్యాక్టీరియా ఊబకాయం వచ్చే అవకాశాన్ని పెంచుతుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. రక్తంలో ఉండే కొన్ని అమైనో ఆమ్లాలు ఒకవైపు ఊబకాయంతో, మరోవైపు పేగుల్లోని సూక్ష్మజీవుల కూర్పుతో సంబంధం కలిగి ఉన్నట్లు పరిశోధనలో వెల్లడైంది. గట్ బ్యాక్టీరియాపై ఇప్పటివరకు జరిగిన అనేక పరిశోధనలు జంతువులపై నిర్వహించినవే. అందువల్ల వాటి ఫలితాలను నేరుగా మనుషులకు వర్తింపజేయలేమని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. అలాగే ఒక వ్యక్తికి ఆరోగ్యకరంగా ఉండే పేగు బ్యాక్టీరియా కూర్పు మరొక వ్యక్తికి కూడా అదే విధంగా ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పలేం. అయినప్పటికీ గట్ మైక్రోబయోటా మన ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుందనే ఆధారాలు క్రమంగా పెరుగుతున్నాయి.

4 రకాల బ్యాక్టీరియాతో సంబంధం..

స్వీడన్‌లోని ల్యాండ్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు రక్తంలో ఉండే ఏ మెటాబోలైట్లు ఊబకాయంతో సంబంధం కలిగి ఉన్నాయో తెలుసుకునేందుకు అధ్యయనం నిర్వహించారు.



# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం







అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

# రజనీకాంత్ ధర్మన్ మూవీ సెకండ్ షెడ్యూల్ ప్రారంభం



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ సరసన సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, కమెడియన్ యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇదివరకే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ రక్తంతో తడిసిన సర్జికల్ టూల్ పట్టుకుని 'ది డెడ్లీ డాక్టర్' ట్యాగ్‌లైన్‌తో కనిపించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ రెండో షెడ్యూల్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అవుతోంది.

# అలా ..రజనీకాంత్ గారితో జతకట్టా

### శ్రియా శరణ్ అనుభవాలు



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా

నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.

# సినీ లవర్స్‌కు పండగే పండగ




నేడు ఒక్కరోజే ఆరు సినిమాలు విడుదల

పంద్రాగాస్ట్ సినీ లవర్స్‌కు పండగ చేయబోతోంది. పలు సినిమాలు 14న శుక్రవారం విడుదల కాబోతున్నాయి. ఇందులో సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకు తుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్నది చిత్ర కథ. విచిత్రమైన పాత్రలు... సరదా సంఘటనలు... ఊహించని మలుపులతో రూపొందుతున్న సినిమానే మా 'పళ్ళ బురుసు' అంటున్నారు ఉదయ్ చౌహాన్. ఆయన దర్శకత్వంలో.. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో రూపొందింది. 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, భావోద్వేగాల మేళవింపుగా ఓ పల్లెటూరి కథతో మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.'ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ 'అగధ' అంటున్నారు హీరో శ్రవణ్ రెడ్డి. ఆయన కీలక పాత్రలో కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ఎంఎస్ రాజు తెరకెక్కించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో భయపెట్టే అంశాలు మాత్రమే కాదు... అంతకుమించిన కథ ఉందని చిత్ర బృందం చెబుతోంది. 'నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ

నచ్చేలా ఉంటుంది' అంటున్నారు

# లోకేశ్ కనగరాజ్ చిత్రం డిసికి పెరుగుతున్న కలెక్షన్లు




కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం.